జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
పుట్టినరోజు / ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు రూ. 500
కోర్టు నోటీసులు / పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు రూ. 600
Contact : 8886022523, 9000621111, 9948725373

సంపుటి 9 సంచిక 150 హైదరాబాద్, ఆగష్టు 30 ఆదివారం 2026 8 పేజీలు వెల : 5.00




# నీట్‌కు సన్నద్ధం

## సెప్టెంబర్ 3నుంచి రెండో విడత కౌన్సెలింగ్

- ఆల్ ఇండియా కోటాకు 3 నుంచి..
- స్టేట్ కోటాకు 7 నుంచి రిజిస్ట్రేషన్లు
- సెప్టెంబర్ 18లోగా కళాశాలల్లో చేరాల్సిందే
- సెలవు రోజుల్లోనూ కొనసాగనున్న అడ్మిషన్ల ప్రక్రియ

ఢిల్లీ, ప్రజాపాలన : దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) కీలక ప్రకటన చేసింది. నీట్ యూజీ2026 రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆల్ ఇండియా కోటా, డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీల్లోని వైద్య సీట్లతో పాటు రాష్ట్ర కోటా సీట్ల భర్తీకి కూడా రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఎంసీసీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ), డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీల్లోని సీట్ల కోసం సెప్టెంబర్ 3 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. తొలి విడతలో సీట్లు పొందలేకపోయిన వారు, కేటాయించిన సీటుతో సంతృప్తి చెందని అభ్యర్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొననున్నారు. అభ్యర్థులు తమ నీట్ ర్యాంకు, అర్హత, అందుబాటులో ఉన్న సీట్లను పరిశీలించి కళాశాలలు, కోర్సుల ప్రాధాన్యతలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఛాయిస్ ఫిల్లింగ్ సమయంలో అభ్యర్థులు అత్యంత జాగ్రత్తగా తమ ప్రాధాన్యతలను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### స్టేట్ కోటా అభ్యర్థులకు సెప్టెంబర్ 7 నుంచి అవకాశం

రాష్ట్ర కోటా సీట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 11వ తేదీ వరకు అభ్యర్థులు నమోదు చేసుకోవచ్చు. ఆయా రాష్ట్రాల కౌన్సెలింగ్ అధికార యంత్రాంగాలు నిర్ణయించిన నిబంధనలు, అర్హత ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లోని సీట్ల భర్తీలో రాష్ట్ర కౌన్సెలింగ్ కీలక పాత్ర పోషించనుంది. అభ్యర్థులు కేంద్ర కౌన్సెలింగ్ షెడ్యూల్‌తో పాటు తమ రాష్ట్ర కౌన్సెలింగ్ అథారిటీ విడుదల చేసే మార్గదర్శకాలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని సూచిస్తున్నారు.

### సెప్టెంబర్ 18లోగా కళాశాలల్లో చేరాలి

రెండో విడత కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 18వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని ఎంసీసీ స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోపు కళాశాలలో రిపోర్ట్ చేయని అభ్యర్థుల విషయంలో నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కళాశాలలో చేరే సమయంలో అభ్యర్థులు నీట్ స్కోర్ కార్డు, కౌన్సెలింగ్ అలాట్‌మెంట్ లెటర్, విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులు, ఇతర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అడ్మిషన్ల ప్రక్రియలో జాప్యం లేకుండా ఉండేందుకు ఎంసీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. శని, ఆదివారాలతో పాటు ఇతర ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించాలని సంబంధిత విద్యా సంస్థలకు సూచించింది.



## ఓట్ల తొలగింపుపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన..



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన సమగ్ర పరిశీలన అవసరమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. SIR ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని కోరారు. వలస కూలీలు, రోజువారీ కూలీలు.. తమ ఓటు హక్కు వివరాలను పరిశీలించుకునేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున అదనపు సిబ్బంది అవసరమని సూచించారు. ఈ మూడు ప్రాంతాల్లో అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. SIR ప్రక్రియను వికేంద్రీకరించాలని సీఈసీకి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## తలక్రిందులుగా తపస్సు చేసినా..
## వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి పొంగులేటి



సూర్యాపేట, ప్రజాపాలన ప్రతినిధి : ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## హైదరాబాద్‌లో గంజాయి చాక్లెట్ల కలకలం.. నిందితుడి అరెస్ట్



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : నగరంలోని శామీర్‌పేట్‌లో భారీగా గంజాయి చాక్లెట్లు పట్టుపడటం కలకలం రేపింది. యువత, చిన్నారులే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి భారీఎత్తున గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన బైద్‌నాథ్, అతడి భార్య పూజారి కొంతకాలంగా శామీర్‌పేట్‌లో నివసిస్తున్నారు. వారు ఓ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి అలవాటుపడిన వారు.. గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. పాన్‌షాప్ ముసుగులో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. సదరు షాప్‌పై దాడి చేశారు. బైద్‌నాథ్‌ను అరెస్ట్ చేసి 25 కేజీల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అతడి భార్య కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు పాఠశాలలు, కాలేజీల వద్ద నిఘా పెంచారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కొనుగోలు చేసే ఆహార పదార్థాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.

## సీజనల్ వ్యాధులను తేలికగా తీసుకోవద్దు: మంత్రి దామోదర రాజనర్సింహా



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణే లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.